

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

ఖాజీపేటలో బంగారం దుకాణంలో జరిగిన చోరీ సంఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఆభరణాలను రికవరీ చేశారు. - 8లో



కరోనా విజృంభిస్తుంటే మహానాడా?

కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో మహానాడు కార్యక్రమాన్ని తక్షణమే వాయిదా వేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం
38.4 /29.4

వాతావరణం

జిల్లాలో శనివారం 29.4 - 38.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

ప్రమాద స్థలం వద్ద సహాయక చర్యలు (ఇన్‌సెట్) గాయపడిన చిన్నారి త్రిషికారెడ్డి



దేవుడా..!

ఆ ప్రయాణంలో
మరో గంట కరిగిపోయి ఉంటే ..
ఆ ఒక్క క్షణం.. అలా జరగకపోయి ఉంటే...
రోజులాగే వారి జీవితంలో
మరో రోజు గడిచి ఉంటే..
ఆనందాల ఉషోదయాలతో..
ఆనందంగా గడిపేవారు..
ఊరంతా తిరుగుతూ..
జాతరంతా సందడి చేసేవారు...
'విధి.. రాత' మరోలా రాసింది..
వారి ఆశల్ని.. నవ్వుల్ని చిదిమేసింది.
జీవితాల్ని క్షణకాలంలో
చీకటిమయం చేసింది.
లారీ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు
కన్న బిడ్డల్ని దూరం చేసి
తల్లికి కడుపుకోత పెట్టింది.
జంటను తనలో కలిపేసుకుని
పసి పాపను విడదీసింది.

కడప నగర శివార్లలోని గువ్వలచెరువు ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

- గువ్వలచెరువు ఘాట్‌లో రోడ్డు ప్రమాదం.. నలుగురి మృతి
- క్షతగాత్రులకు రిమ్స్‌లో వైద్య సేవలు
- శోకసంద్రమైన ఊళ్లు



ప్రమాదంలో మృతి చెందిన శిరీషారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రిషికేశవరెడ్డి, సాయి హర్షిత

చింతకొమ్మదిన్నె/కడప అర్బన్ : గువ్వలచెరువు ఘాట్ మరోసారి రక్తమోడింది. శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా.. రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

● బెంగుళూరు నుంచి కడప వైపు వస్తున్న కారును.. విల్లుపురం నుంచి హైదరాబాదు వైపు షుగర్ బస్తాల లోడుతో వస్తున్న లారీ అదుపుతప్పి కారుపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జుగా మారింది. ప్రమాదం జరిగిందనే విషయం తెలిసేలోపే నలుగురి ప్రాణాలు గాల్లో కలిశాయి. ఈ క్రమంలోనే త్రిషికా రెడ్డి అనే చిన్నారిని బయటికి మట్టికుప్పల్లోకి తోసివేయడంతో ప్రాణాలతో బయటపడింది. అలానే మరో ఇద్దరు మహిళలు శశికళ (38), సిద్ధమూర్తి స్వర్ణలత (34) ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కారులోనే ఇరుక్కుపోయి ఉండిపోయారు. సమాచారం అందుకున్న వెంటనే చింతకొమ్మదిన్నె సీఐ శంకర్‌నాయక్, డీటీఆర్‌బీ సీఐ మహమ్మద్ బాబా తమ సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. దాదాపు గంటన్నరసేపు శ్రమించి లారీని టిప్పర్ సాయంతో పక్కకు తీశారు. కారులోని బసినేని శ్రీకాంత్‌రెడ్డి (32), అతని భార్య శిరీషారెడ్డి (28), కోగటం సాయి హర్షిత (9), రిషికేశవరెడ్డి (11) మృతదేహాలను బయటికి తీశారు. గాయపడ్డ బసినేని శశికళ, సిద్ధమూర్తి స్వర్ణలతను కడప రిమ్స్‌కు తరలించారు.

లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం చోటుచేసుకుందని అధికారులు భావిస్తున్నారు. అధిక లోడుతో పాటు బ్రేకులు ఫెయిల్ కావడం కూడా ప్రమాదానికి మరో కారణంగా తెలుస్తోంది.

రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం

బద్వేలు పరిధిలోని బి.కోడూరు మండలం గంగిరెడ్డిగారిపల్లె ప్రభలవీడు వీధికి చెందిన కోగటం తిరుపతిరెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. భార్య శశికళ, పిల్లలు కోగటం రిషికేశవరెడ్డి, కోగటం సాయి హర్షితలతో కలిసి బెంగుళూరులో ఉంటున్నాడు. ఉద్యోగ నిమిత్తం వారం రోజుల కిందట జర్మనీకి వెళ్లాడు. భార్య, పిల్లలు బెంగుళూరులోనే ఉంటున్నారు.

● బద్వేలు మండలం చిన్నపుత్తాయపల్లెకు చెందిన బసినేని శ్రీకాంత్‌రెడ్డి, శిరీషారెడ్డిలకు నాలుగేళ్ల కిందట వివాహమైంది.శ్రీకాంత్‌రెడ్డి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. వీరికి త్రిషికారెడ్డి (3) కుమార్తె ఉంది. ఈ రెండు కుటుంబ సభ్యులతో పాటు శిరీషారెడ్డి సోదరి స్వర్ణలతతో కలిసి బద్వేలు మండలం చిన్న పుత్తాయపల్లెలో ఆదివారం జరగనున్న జాతర కోసం శనివారం తెల్లవారుజామున బెంగుళూరు నుంచి కారులో బయలుదేరారు. అకస్మాత్తుగా జరిగిన ప్రమాదంలో శ్రీకాంత్‌రెడ్డి, శిరీషారెడ్డి దంపతులు మృతి చెందగా.. చిన్నారి త్రిషికారెడ్డి ప్రాణాలతో బయటపడింది.

● మరోవైపు పిల్లలు సాయి హర్షిత, రిషికేశవరెడ్డి మృత్యువాతపడగా.. తల్లి శశికళ గాయాలతో రిమ్స్‌లో చికిత్స పొందుతోంది. శశికళ భర్త ప్రస్తుతం జర్మనీలో ఉంటున్నారు. పిల్లలు మరణించారన్న వార్తను తెలుసుకున్న తండ్రి తిరుపతిరెడ్డి జిల్లాకు బయలుదేరినట్లు సమాచారం.రిమ్స్ ఆవరణలో బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ సంఘటన బద్వేలు, బి.కోడూరు మండలాల్లో ప్రజలను విషాదంలోకి నెట్టింది.

పరామర్శ



గువ్వలచెరువు ఘాట్ ప్రమాదంపై బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ విచారం వ్యక్తం చేశారు.రిమ్స్‌కెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రిమ్స్‌కు వెళ్లి మృతదేహాలను పరిశీలించారు.

ఆ మలుపులు.. మృత్యు పిలుపులు



గువ్వలచెరువు ఘాట్ ప్రమాదకరంగా మారింది. ఈ ఘాట్‌లో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా... రవాణాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారేగానీ సమస్యకు పరిష్కారం చూపడం లేదని విమర్శలు వస్తున్నాయి. గతేడాది ఇదే విధంగా జరిగిన ప్రమాదంలో చక్రాయపేట మండలానికి చెందిన ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే.

ఊరంతా విషాదం

బద్వేలు అర్బన్ : గువ్వలచెరువు ఘాట్ ప్రమాదం రెండూళ్లలో తీవ్ర విషాదాన్ని నింపింది. ముఖ్యంగా చింతపుత్తాయపల్లెలో ఏడాదికోసారి జరిగే జాతరలో పాల్గొని కుటుంబ సభ్యులు, బంధువులతో సరదాగా గడపాలనుకున్న వారి ఆశల్ని చిదిమేసింది. కోటి ఆశలతో పనిచేస్తున్న ప్రాంతం నుంచి స్వగ్రామానికి బయలుదేరిన ఆ దంపతులను, వారి బంధువుల పిల్లలను లారీ రూపంలో వచ్చిన మృత్యుశకటం కబళించింది. రోడ్డు ప్రమాదంలో చింతపుత్తాయపల్లె గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి, శిరీష, బి.కోడూరు మండలం గంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సాయిహర్షిణి, రిషికేశవరెడ్డిలు మృతిచెందడంతో ఆయా గ్రామాల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. చింతపుత్తాయపల్లె గ్రామంలో జాతర వాయిదా వేశారు. అలాగే అక్కాతమ్ముడు రిషికేశవరెడ్డి, సాయి హర్షిత మృతిచెందడంతో గంగిరెడ్డిపల్లెలో విషాదం అలుముకుంది.



శ్రీకాంత్‌రెడ్డి, శిరీష మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ పరామర్శ

బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళరాజగోపాల్‌రెడ్డి కడప రిమ్స్‌కు వెళ్ళి మృతదేహాలకు నివాళులర్పించడంతో పాటు గాయపడిన వారిని పరామర్శించారు.

● రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శ్రీకాంత్‌రెడ్డి, శిరీష, సాయిహర్షిణి, రిషికేశవరెడ్డి మృతదేహాలకు శనివారం సాయంత్రం కడప రిమ్స్‌లో పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహాలను ఆయా స్వగ్రామాలకు తరలించారు. చింతపుత్తాయపల్లెలో బంధువులు, స్నేహితుల రోదనలతో ఊరంతా శోకసంద్రమైంది.

రోడ్డు ప్రమాదంపై మంత్రుల దిగ్భ్రాంతి

కడప సెవెన్‌రోడ్స్: రోడ్డు ప్రమాదంపై జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే ఎస్పీ అశోక్ కుమార్ తో మంత్రి సవిత ఫోన్ లో మాట్లాడారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందజేస్తున్నామన్నారు. పోలీసు అధికారులు ప్రమాదాలపై చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సవిత పేర్కొన్నారు.

● చింతకొమ్మదిన్నె మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడంపై అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర రోడ్లు , భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తరుచుగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రాంతాలను డేంజర్ స్పాట్‌లుగా గుర్తించి ప్రయాణికులను అప్రమత్తం చేసే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

హత్యాచార ఘటన నిందితుడిని శిక్షిస్తాం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని మైలవరం మండలం ఏ.కంబాల దిన్నెలో మూడేళ్ల చిన్నారి హత్యాచార ఘటనపై జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్ల చిన్నారితో నిందితుడు రహమతుల్లా మృగంలా ప్రవర్తించడం దారుణమన్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్‌ను ఫోన్ ఆదేశించారు. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపిన మంత్రి, ప్రభుత్వ పరంగా అండగా ఉంటామన్నారు. నిందితుడిని చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు.

హత్యాచార ఘటనపై ఎస్పీ సీరియస్



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

జమ్మలమడుగు : చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడికి కఠినంగా శిక్షిస్తామని ఎస్పీ అశోక్‌కుమార్ బాధితురాలు తల్లికి హామీ ఇచ్చారు.శనివారం ఆయన పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మైలవరం మండలంలోని ఎ.కంబాలదిన్నె గ్రామంలో జరిగిన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డీఎస్పీ వెంకటేశ్వరరావుతో కేసు పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

న్యూస్‌రీల్

వెబ్‌సైట్‌లో జాబితా

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూల్ పూర్వపు జిల్లాలోని 32 మంది ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో సమర్పించిన బదిలీల అప్లికేషన్‌లు అప్రూవల్ చేసి జాబితాను ఆర్జేడీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శామ్యూల్ ప్రకటనల్లో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఈ సీనియారిటి జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు.

డీఈఓ వెబ్‌సైట్‌లో ..

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడికడప జిల్లాలోని 124 మంది జిల్లా పరిషత్తు, 5 మంది మున్సిపల్ కార్పొరేషన్, 3 మున్సిపాలిటి ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో సమర్పించిన బదిలీల అప్లికేషన్ల అప్రూవ్ చేసిన జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ షంషుద్దీన్ తెలిపారు.

388 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలలో భాగంగా శనివారం నిర్వహించిన జీవశాస్త్రం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా 28 పరీక్షా కేంద్రాలకుగాను 3912 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 388 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని నాలుగు బృందాల ఫ్లయింగ్ స్క్వాడ్ 12 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా డీఈఓ షేక్ షంషుద్దీన్ మూడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు జరిగాయిని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు.

నూతన నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాకు చెందిన పలువురు నాయకులను పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పీలేరుకు చెందిన కె.మహితను స్టేట్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా, రాజంపేటకు చెందిన పి.రెహ్మాన్‌ఖాన్‌ను రాష్ట్ర బూత్ కమిటీల విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

'మహానాడు'కు పటిష్ట భద్రతా ఏర్పాట్లు



కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో భద్రత ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా.. చిత్రంలో ఎస్పీలు, పోలీసు అధికారులు

పోలీస్ అధికారులకు డీజీపీహరీష్ కుమార్ గుప్తా దిశానిర్దేశం

కడప అర్బన్ : జిల్లాలో ఈ నెల 27 నుంచి జరగనున్న 'మహానాడు'కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పోలీస్ అధికారులను శనివారం ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు అంశాలపై పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. 'మహానాడు'కు పలువురు వీవీఐపీలు, వీఐపీలు, పెద్ద ఎత్తున ప్రజలు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ పరంగా ఎటువంటి అవాంతరాలు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, పార్కింగ్ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్‌ను ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లేలా మళ్లించాలని ఆదేశించారు. పకడ్బందీగా రూట్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్ అధికారులకు కేటాయించిన విధులను అప్రమత్తంగా ఉంటూ నిర్వర్తించాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీజీ (లా అండ్ ఆర్డర్) ఎన్.మధుసూదన్ రెడ్డి, కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షెముషి బాజ్ పేయి, వైఎస్సార్ జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, కర్నూలు జిల్లా ఎస్పీవిక్రాంత్ పాటిల్, అన్నమయ్య ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, అనంతపురం ఎస్పీ పి.జగదీశ్, గుంతకల్ రైల్వే ఎస్పీ రాహుల్ మీనా, అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ వాహనానికి ఫైన్

రాయచోటి : చట్టానికి ఎవరూ అతీతులు కారు. చట్టప్రకారం నడుచుకోవడం అందరి బాధ్యత. అయితే కొందరు చట్టాలను ఉల్లంఘిస్తుంటారు. ఈ నేపథ్యంలో శనివారం ఓ కానిస్టేబుల్ తన బైక్ నంబర్ ప్లేట్‌పై వాహనం రిజిస్ట్రేషన్ నంబరు వేయకపోవడాన్ని గుర్తించిన సీఐ మొదటి తప్పుగా జరిమానాతో సరిపెట్టారు. ఈ అరుదైన సంఘటన అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో చోటు చేసుకుంది. అనునిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతలో ఓ కానిస్టేబుల్ ద్విచక్రవాహనం నంబరు ప్లేట్ మీద నంబర్ లేకుండా.. పోలీస్ అని బోర్డు తగిలించుకొని రయ్ మని వెళ్తుండగా ట్రిబుల్ స్టార్ ట్రాఫిక్ పోలీస్ అధికారి విశ్వనాథరెడ్డి గుర్తించారు. వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీస్ వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి నంబర్ ప్లేట్‌పై రిజిస్ట్రేషన్ నంబర్ లేకపోవడం పట్ల కానిస్టేబుల్‌ను సీఐ ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్ మీద నంబర్ లేకుండా పోలీస్ అని రాయడం నేరమంటూ ఫొటో తీసి రూ.335 జరిమానా వేశారు. వెంటనే పేరు తొలగించి రిజిస్ట్రేషన్ నంబర్‌ను వేయించుకోవాలని ఆ కానిస్టేబుల్‌కు చెప్పి పంపారు. ఈ దృశ్యం అక్కడ ఉన్న ప్రజలను ఆశ్చర్యచకితులను చేసింది. సీఐ చిత్తశుద్ధిని ప్రజలు ప్రశంసించగా.. మిగిలిన వాహనదారులకు హెచ్చరికగా ఉందన్న వ్యాఖ్యలు కూడా వినిపించాయి.

ఐటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా గిరిధర్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కొప్పోలు గిరిధర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఐటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ఉద్యాన పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశానికి అవకాశం

కలికిరి : ఉద్యాన పాలిటెక్నిక్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలికిరిలోని డా. వైఎస్సార్ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కలికిరి, నూజివీడు, మడకశిర, రామచంద్రాపురంలో ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలు, మరో ఏడు ప్రైవేటు కళాశాలలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు.

క్లుప్తంగా

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

చాపాడు : మండలంలోని ద్వారకానగరం గ్రామానికి చెందిన చింతకుంట దస్తగిరి (33) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దస్తగిరి గత కొన్ని రోజులుగా అప్పుల బాధతో మనస్థాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబీకులు కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని విజయ్‌కుమార్ సర్కిల్ సమీపంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్పృహ కోల్పోయి కింద పడిపోయిన అతను కొద్ది సేపటి తర్వాత మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అతను సమీపంలోని దుకాణాల్లో భిక్షాటన చేసుకుంటూ జీవనం గడిపేవాడని చెప్పారు. త్రీ టౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాల కోసం స్థానికులను విచారించినా వ్యక్తిగత వివరాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే త్రీ టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ గోవిందరెడ్డి కోరారు.

సెపక్ తక్రా పోటీలలో ప్రతిభ



కాంస్య పతకం సాధించిన పాపన నాగహారికరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : కేంద్ర పాలిత ప్రాంతమైన డ్యూలో మే 18 నుంచి జరుగుతున్న ఖేలో ఇండియా సెపక్ తక్రా పోటీలలో వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన పాపన నాగ హారికరెడ్డి ప్రతిభను చాటింది. మహిళా సెపక్ తక్రా డబుల్ ఈవెంట్‌లో ఆంధ్ర ప్రదేశ్ బాలికలు ప్రత్యర్థులపై వరసగా విజయాలు సాధించి కాంస్య పతకాన్ని సాధించారని సెపక్ తక్రా రాష్ట్ర సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు తెలిపారు.

పంట ఉత్పత్తుల పెంపు లక్ష్యంగా..!

- 29 నుంచి కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలు
- శాస్త్రవేత్తలు, అధికారుల బృందాలతో వ్యవసాయంపై అవగాహన



మైదుకూరు మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం

మైదుకూరు : పంట ఉత్పత్తుల పెంపు లక్ష్యంగా ఈనెల 29 నుంచి 15 రోజుల పాటు దేశంలోని 700కుపైగా జిల్లాల్లో కృషి సంకల్ప అభియాన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్యక్రమాలను నిర్వహించనుంది. కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) ఆధ్వర్యంలో 731 కృషి విజ్ఞాన కేంద్రాలకు చెందిన శాస్త్రవేత్తలు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తారు. కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమ లక్ష్యం ప్రధానంగా పంట ఉత్పత్తులను పెంచడమే. గతంలో దేశంలోని ప్రజలకు సరిపడా ఆహార పదార్థాలు లేక ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది. ఆ పరిస్థితి మారి ఇప్పుడు దేశ ప్రజల అవసరాలు తీరి మనమే ఇతర దేశాలకు ఆహార ధాన్యాలను ఎగుమతి చేస్తున్నాం. అయితే పంట ఉత్పత్తులను మరింత పెంచడం ద్వారా ప్రజలకు మరింత పౌష్టికాహారాన్ని అందించాలన్నదే కృషి సంకల్ప అభియాన్ లక్ష్యం. ఇందు కోసం నాణ్యమైన విత్తనాలను అందించడం, పంటల సాగులో ఆధునిక పద్ధతులను సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించనున్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం..

పంట దిగుబడులను పెంచడమే కాక రైతు విచక్షణా రహితంగా పంటల సాగులో పురుగు మందులను వినియోగించకుండా చూడటం కూడా ఈ కార్యక్రమాల లక్ష్యం. ఇందు కోసం రైతుల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించేలా అవగాహన కల్పించడం చేస్తారు. సేంద్రియ ఎరువులను, రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయంగా ఎంచుకోవాలని సూచిస్తారు. తద్వారా ప్రమాద రహిత ఆహారాన్ని అందరికి అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యం.

కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలు..

''ప్రయోగశాల నుంచి భూమికి'' అనే నినాదంతో కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వ్యవసాయంలో అధునాతన పద్ధతులు, కొత్త రకాలు, ప్రభుత్వ పథకాలు, సాంతికేక పరిజ్ఞానం, పంటల వైవిధ్యం అంశాలుగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడతారు. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు ఖరీఫ్‌లో సాగు చేసే పంటల ఉత్పత్తులను పెంచడం, పెట్టుబడులను తగ్గించడంపై అవగాహన కల్పిస్తారు. రైతుల జీవనోపాధిపై భరోసా కల్పించడం, లాభసాటి వ్యాపార సరళిలో వ్యవసాయం చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు వ్యవసాయంపై మక్కువ కలుగజేయడమే కృషి సంకల్ప అభియాన్ లక్ష్యం.

రైతులకు మంచి అవకాశం



కేంద్ర వ్యవసాయ శాఖ చేపట్టిన కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాలు రైతులకు మంచి అవకాశం. ఈ కార్యక్రమాల ద్వారా వ్యవసాయ రంగంలో వచ్చిన కొత్త పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు తెలుసుకునే అవకాశం కలుగుతుంది. ఈ కార్యక్రమం వల్ల పంటల సాగులో రైతుల దృక్పథం తప్పకుండా మారుతుంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఎం.బాలకృష్ణ, అధిపతి, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, వనిపెంట, మైదుకూరు మండలం

కొత్త విషయాలు తెలుస్తాయి



కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాల ద్వారా రైతులకు కొత్త విషయాలు తెలుస్తాయి. పంటల సాగులో కొత్త పద్ధతులు, కొత్త రకాల విత్తనాల గురించి తెలుసుకునే అవకాశం ఉంటుంది. సాంకేతిక పరిజ్ఞానం కూడా పరిచయం అవుతుంది. ఈ కార్యక్రమం ప్రకృతి వ్యవసాయం విస్తరణకు ఎంతో ఉపయోగపడుతుంది.

– ఎం.రామనందారెడ్డి, రైతు, ఓబులాపురం, మైదుకూరు మండలం

మద్యం మత్తులో దాడి



తీవ్ర గాయమై చికిత్స పొందుతున్న అరవింద్

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీవద్ద ఉన్న మద్యం దుకాణం వద్ద మద్యం తాగే సమయంలో అరవింద్, రవితేజ అనే యువకుల మధ్య శనివారం మాటామాటా పెరిగింది. మద్యం మత్తులో ఉన్న రవితేజ అరవింద్‌పై బాటిల్ పగులగొట్టి దాడి చేశాడు. ఈ దాడిలో అరవింద్‌కు గొంతు వద్ద తీవ్ర గాయమైంది. దీంతో హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

టైలరింగ్, బ్యూటీ థెరపీపై శిక్షణ

తంబళ్లపల్లె : స్థానిక టీఎస్.వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ హబ్ సెంటర్ ద్వారా మహిళలకు టైలరింగ్, బ్యూటీ థెరపీపై శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, కో ఆర్డినేటర్ చౌడయ్య తెలిపారు. మూడు నెలల పాటు ఈ శిక్షణ ఇస్తారని, 15 సంవత్సరాలకు పైబడి 45 ఏళ్ల వయస్సు లోపు ఉన్న మహిళలు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ నెల 29వ తేదీ లోపు ఐటీఐ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9618655759లో సంప్రదించాలన్నారు.

బంగారం దుకాణంలో చోరీ కేసు:ముగ్గురి అరెస్టు

- బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం
- పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలింపు
- వివరాలు వెల్లడించిన మైదుకూరు డీఎస్పీ



చోరీ కేసులో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న మైదుకూరు డీఎస్పీ, ఖాజీపేట సీఐ

ఖాజీపేట : ఖాజీపేటలో బంగారం దుకాణంలో జరిగిన చోరీ సంఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలను రికవరీ చేశారు. శనివారం ఖాజీపేటలో డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సీఐ మోహన్ విలేకరులకు వివరాలు వెల్లడించారు.

ఖాజీపేట టౌన్‌లోని వీఎస్ జ్యువెలరీ దుకాణంలో ఏప్రిల్ 12న అర్ధరాత్రి సమయంలో దొంగలు చోరీ చేసి వెండి ఆభరణాలతో పాటు, బంగారం చోరీ చేశారు. ఈ కేసును ఖాజీపేట సీఐ మోహన్ ఛాలెంజ్‌గా తీసుకుని ప్రత్యేక దృష్టి సారించారు. సీసీ కెమెరాల్లో జరిగిన చోరీ రికార్డులను పరిశీలించారు. అందులో ఒక బొలెరో సిటీ పికప్ వాహనం లో చోరీ చేసిన దొంగలు పరారైనట్లు నిర్ధారించారు. ఈ ఫుటేజ్‌లోని వాహనాన్ని గుర్తించారు. ఈ వాహనం ఆధారంగా దొంగలు కర్నాటక రాష్ట్రానికి చెందిన వారినిగా తేల్చారు. ఆరుగురు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు.

ముగురు అరెస్టు..

మరో ముగ్గురి కోసం గాలింపు

పోలీసులకు అందిన సమాచారం మేరకు చెన్నూరు మండలం ఇర్కాన్ సర్కిల్ వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వారిని ఖాజీపేట సీఐ అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. వీరిలో యర్రగొల్ల బసవరాజు, సంజీవ అలియాస్ కొవ్వూరు సంజీవప్ప, ఎల్లప్పగా గుర్తించారు. వీరితోపాటు శంకరప్ప, మారుతి, బసవమోడేకర్‌లు చోరీల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. ఖాజీపేటలోని వీఎస్ బంగారం దుకాణంతోపాటు చెన్నూరు, కమలాపురం పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల్లో కూడా వీరు నిందితులుగా ఉన్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బంగారం, వెండి రికవరీ..

చోరీకి పాల్పడిన వారి నుంచి బంగారం, వెండిని పోలీసులు రికవరీ చేశారు. అందులో 100 గ్రాముల కుంకుమ భరిణ, 232 గ్రాముల 15 వెండి దీపాలు, 500 గ్రాముల 3 వెండి ప్లేట్లు, 293 గ్రాముల వెండి మెట్టెలు, 400 గ్రాముల వెండి గజ్జలు, 3.860 గ్రాముల బంగారు కమ్మలు, 2.430 గ్రాముల బంగారు ఉంగరం, 4.820 గ్రాముల బంగారం కమ్మలు దొంగల నుంచి స్వాధీనం చేసుకున్నారు.

సులభంగా డబ్బు సంపాదన కోసమే..

చోరీ కేసులోని ఆరుగురు నిందితులు చెడు వ్యసనాలకు బానిసలై, సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో చోరీలకు పాల్పడేవారు. ఒక బొలెరో సిటీ పికప్ వాహనం ద్వారా పందులను దొంగతనం చేసేవారు. అలాగే చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ వచ్చారు. మొదట చోరీ చేయాలన్న ప్రదేశంలో రాత్రి వేళల్లో రెక్కీ నిర్వహించి అనువైన ఇళ్లు, దుకాణాలను గుర్తించేవారు. తరువాత ఆ దుకాణాలు, ఇళ్లలో చోరీ చేసేవారు.

కరోనా విజృంభిస్తుంటే మహానాడా?

- మార్గదర్శకాలు మీరే ఉల్లంఘిస్తే ఎలా
- ప్రజా శ్రేయస్సు దృష్ట్యా వాయిదా వేసుకోండి
- వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ఈనెల 27 నుంచి 29 వరకు కడపలో నిర్వహించ తలపెట్టిన మహానాడు కార్యక్రమాన్ని తక్షణమే వాయిదా వేసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తొలుత రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో 4097 కేసులు నమోదైనట్లు తెలుస్తోందని, ప్రభుత్వం మాత్రం 265 కేసులు వచ్చాయని చెబుతోందన్నారు. ఇప్పటికే ఐదుగురు మృతి చెందినట్లు తెలుస్తోందన్నారు. ఇది కొత్త వేరియంట్ కావడంతో పరిస్థితి క్రిటికల్‌గా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం చెబుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ మార్గదర్శకాలు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో లక్షలాది మందిని తరలించి మహానాడు నిర్వహిస్తే కరోనా కొన్ని కోట్ల మందికి చేరే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలంటే టీడీపీకి లెక్కలేదన్నారు. గతంలో గోదావరి పుష్కరాల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 29 మంది, ఎన్నికల సభలో 8 మంది, గుంటూరులో చంద్రన్న కానుక పంపిణీ సమయంలో ముగ్గురు మృతి చెందారని వివరించారు. టీడీపీకి ప్రజల పట్ల బాధ్యత ఉంటే మహానాడు కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాలన్నారు. ప్రోటోకాల్ ముసుగులో మహానాడు ఏర్పాట్లన్నీ అధికారులే చేస్తున్నారని విమర్శించారు. ఇది అధికార దుర్వినియోగానికి పరాకాష్టగా అభివర్ణించారు. ప్రజలకు ఏం చేశారని మహానాడు నిర్వహిస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ సంవత్సర కాలంలో ఏం ఘనకార్యం చేశారని మహానాడు నిర్వహిస్తున్నారని నిలదీశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 146 హామీలలో పెన్షన్లు తప్ప మిగతా ఏవీ అమలు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. దేశంలో కరోనా వ్యాపిస్తోందని, కడపలో ఇప్పటికే 2 కేసులు నమోదైనట్లు రిమ్స్ సూపరింటెండెంట్ ధ్రువీకరించారన్నారు. కరోనా మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం వాటినే తుంగలో తొక్కుతోందని ధ్వజమెత్తారు. ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని మహానాడు వాయిదా వేసుకోవాలని కోరారు.

జేసీకి వైఎస్సార్‌సీపీ నేతల వినతి

దేశ వ్యాప్తంగా కరోనా విజృంభిస్తోందని, ఇప్పటికే పలుచోట్ల మరణాలు సంభవించాయని, ఈ పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ కడపలో మూడు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన మహానాడు కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై తమ రాష్ట్ర పార్టీ గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, కార్పొరేటర్ షఫీ, సీహెచ్ వినోద్‌కుమార్, శ్రీరంజన్‌రెడ్డి, పాకా సురేష్, దాసరి శివప్రసాద్, యానాదయ్య, బీహెచ్ ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోండి

పులివెందుల : పులివెందుల పట్టణం కదిరి రోడ్డులోని ఎర్రగుడిపాలెం గ్రామ పొలంలోని 170/1, 170/2, 171/1 సర్వే నంబర్లలో గల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని బాధితుడు ఆర్.శ్రీనివాస్ కోరారు. శనివారం పులివెందుల పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 35 ఏళ్లుగా ఆ సర్వే నెంబర్లకు సంబంధించిన ప్రభుత్వ భూమిని సుబ్బరామయ్య అనే వ్యక్తి సాగు చేసుకుంటుండేవాడన్నారు. అతను మరణించిన తర్వాత అతని భార్య, కుమారుడు ప్రకాష్‌లు తనను ఆశ్రయించి ఈ భూమిని సాగు చేసుకునేందుకు ఇబ్బందిగా ఉందని, వ్యవసాయం చేసుకుని వచ్చిన ఆదాయాన్ని ఇరువురం తీసుకుందామని ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. అయితే తనకు ఉద్యోగరీత్యా ఇబ్బందిగా ఉండటంతో 2018లో ఆర్టీసీ డ్రైవర్ షరీఫ్‌ను కాపాలాదారునిగా నియమించానన్నారు. ఆ స్థలంలో ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారన్నారు. 2019 నుండి షరీఫ్ ఆలయం, స్థలం తనదే అని చెప్పుకుంటూ ఈ స్థలాన్ని ఆక్రమించుకుని మోసం చేయాలని చూస్తున్నాడని ఆరోపించారు. ప్రభుత్వానికి సంబంధించిన భూమిని రెవెన్యూ అధికారులు పరిశీలించి స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు.

టీటీడీ లీగల్ కౌన్సిల్ సభ్యునిగా జీఎస్ మూర్తి



జీఎస్ మూర్తి

కడప రూరల్ : తిరుమల తిరుపతి దేవస్థానం లీగల్ కౌన్సిల్ సభ్యునిగా జీఎస్ మూర్తిని నియమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. జీఎస్ మూర్తి జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాదిగా, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్నారు. ఈయన 1983 నుంచి తెలుగుదేశం పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే మాధవిరెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పలువురు న్యాయవాదులు జీఎస్ మూర్తిని అభినందించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప–కృష్ణాపురం రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం చైన్నై – ముంబై వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కడప రైల్వే ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9440900811, 9440627658 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. మృతదేహాన్ని కడప రిమ్స్ మార్చురీకి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపివేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ కోరారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి కేశవరావుతో పాటు 27 మందిని ఎన్‌కౌంటర్ పేరుతో కేంద్ర సాయుధ బలగాలతో హత్య చేయించారని దీనిపై వెంటనే న్యాయవిచారణ చేయాలని కోరుతూ శనివారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో వివిధ రాజకీయ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ పౌరులను, ఆదివాసీలను హత్య చేసి కార్పొరేట్ సంస్థలకు విలువైన అటవీ సంపద, ఖనిజ వనరులను ధారాదత్తం చేస్తున్నాయని మండిపడ్డారు. 'ఆపరేషన్ సింధూర్' ను అమెరికా జోక్యంతో నిలిపివేసి పాకిస్తాన్‌తో చర్చలకు పూనుకుంటున్నారు గానీ, సొంత దేశంలో మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు చేపట్టకుండా మోదీ ద్వయం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, వెంకటశివ, పౌర హక్కుల సంఘం నాయకులు సి. వెంకటేశ్వర్లు, సురేష్ బాబు, రెడ్డయ్య, రవిశంకర్, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ గుర్రాల గోపాల్, డాక్టర్ ఓబుల్ రెడ్డి , మల్లెల భాస్కర్ , విరసం వరలక్ష్మి, జన విజ్ఞాన వేదిక నాయకులు శివరాం , కార్మిక సంఘం నాయకుడు డబ్ల్యు రాము , రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు ప్రసాద్, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకుడు సృజన శ్రీనివాస రెడ్డి, సీఐటీయూ నాయకులు సుంకర రవి, కామనూరు శ్రీనివాసరెడ్డి, విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకుడు మల్లికార్జున్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, లోక్‌సత్తా నాయకులు కృష్ణ, ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకుడు ద్రాక్షం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు విద్య పునాది లాంటిది

ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : విద్య అనేది భవిష్యత్తుకు పునాది లాంటిదని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక మధురెడ్డి కల్యాణ మండపంలో సంసిద్ధ్ సతీష్ రెడ్డి పాఠశాలలో టాటా క్లాస్ ఎడ్జ్ ఇంప్రింట్స్ సంస్థ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన నూతన కోర్సుల ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కడప ఎంపీ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి నూతన కోర్సులను ప్రారభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విద్య అనేది ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. దానికి తగ్గట్టుగా తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు నచ్చిన విధంగా ప్రోత్సహిస్తే గొప్పవారవుతారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారికి కూడా విద్యను అందించాలనే ఉద్దేశంతో పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లెలో సంసిద్ధ్ సతీష్ రెడ్డి పేరుతో పాఠశాలను నెలకొల్పడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు మంచి నాణ్యత గల విద్యనందించేందుకు పాఠశాల సిబ్బంది కృషి చేయాలని సంసిద్ధ్ సతీష్ రెడ్డి పాఠశాల ఫౌండర్ సతీష్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో సంసిద్ధ్ పాఠశాల గ్రూపు చైర్మన్ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, సంసిద్ధ్ పాఠశాల రీజనల్ కోఆర్డినేటర్ అంజద్‌బాషా, తుషార్ నాగిరెడ్డి, రోహన్ నాగిరెడ్డి, ప్రిన్సిపల్ పరిమళ, చైతన్యలతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

కడప రూరల్ : కడపలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడును జయప్రదం చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు. శనివారం ఆ పార్టీకి చెందిన నేతలు మహానాడు ప్రాంగణంలో చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 27, 28, 29వ తేదీల్లో మహానాడును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి రెండు రోజులు 23 వేల మంది ప్రతినిధులతో సమావేశం ఉంటుందన్నారు. చివరి రోజు భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. మహానాడు కోసం అన్ని ఏర్పాట్లు చేపట్టామని, పనులు శరవేగంగా జరుగుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆ పార్టీ నేతలు అనగాని సత్యప్రసాద్, సంధ్యారాణి, బీటీ నాయుడు, బీద రవిచంద్ర, నిమ్మల రామానాయుడు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, బీటెక్ రవి తదితరులు పాల్గొన్నారు.

కరోనా లేదు ఏమీ లేదు

కరోనా లేదు ఏమీ లేదు అని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో మీడియా ప్రతినిధులు కరోనా ఉన్న సమయంలో మహానాడును నిర్వహించవచ్చా అని ప్రశ్నించారు. దీనికి శ్రీనివాసులురెడ్డి స్పందించారు. మహానాడును చూసి ఓర్వలేక ప్రతిపక్ష నేతలు కరోనాను సాకుగా చూపిస్తున్నారని తెలిపారు. కరోనా లేదు ఏమీ లేదని తెలిపారు. మహానాడును విజయవంతగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.